సాక్షి
జనగామ

ఆదివారం | 31 | ఆగస్టు | 2025



మహబూబాబాద్ జిల్లా గూడూరులో ప్రధాన బస్టాండ్ సెంటర్ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, జువాలజీ విభాగంలో అతిథి అధ్యాపక(గెస్ట్ లెక్చరర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాహత్‌ఖానం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం సరిపోతుందన్నారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ ఉన్న వారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 3వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా జనగామలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4న ఏబీవీ డిగ్రీ కళాశాలలలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

విఘ్నేశ్వరుడికీ తప్పని వానర బాధలు



స్టేషన్‌ఘన్‌పూర్: గణాధిపతి విఘ్నేశ్వరుడికి సైతం వానరాల బాధలు తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ ఉత్సవ సమితిల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అయితే మండలంలోని కొత్తపల్లి, తాటికొండ, పాంనూర్, మీదికొండ, నమిలిగొండ, తానేదార్‌పల్లి తదితర గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో విఘ్నేశ్వర మండపాల్లో ఏర్పాటు చేసిన లడ్డూలు, కొబ్బరి కుడుకలు, పండ్లు తదితర ప్రసాదాలకు కోతుల నుంచి రక్షణ కోసం పలు ఉత్సవ సమితిలు మండపాలకు రక్షణగా వలలను ఏర్పాటు చేశారు.

మరోసారి టీచర్ల సర్దుబాటు

జనగామ: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ నేపథ్యంలో రాష్ట్రంలో టీచర్ల సర్దుబాటుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. ఇటీవల ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించగా, ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ నెల 1వ తేదీన 109 మంది టీచర్లను సర్దుబాటు చేయగా, అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. సర్దుబాటులో పలుకుబడిన వారికే పెద్దపీట వేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పైరవీలకు ఆస్కారం కల్పించారంటూ పలు పాఠశాలల వద్ద తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దీనిపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీయగా, సర్దుబాటుకు తాత్కాలిక బ్రేకులు పడ్డాయి. ఇదే క్రమంలో 87 ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడంతో 50 ప్రాథమిక పాఠశాలల్లో ఒకేఒక్క టీచర్ మిగలడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోయింది. దీనిపై సాక్షిలో వరుస కథనాలను ప్రచురితమయ్యాయి. స్పందించిన ప్రభుత్వం సర్దుబాటును మరోసారి చేపట్టాలని ఆదేశిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వచ్చేనెల 4 వరకు పూర్తిచేయాలి

రెండోసారి చేపట్టనున్న సర్దుబాటు ప్రక్రియను వచ్చే నెల 4వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. పాఠశాలల్లో పిల్లల నమోదు, సబ్జెక్టుల వారీగా అవసరాలను పరిగణలోకి తీసుకుని టీచర్ల సర్దుబాటు చేసే ప్రక్రియను కలెక్టర్లకు అప్పగించారు.

పట్టపగలే చైన్ స్నాచింగ్



బాధిత మహిళ

జనగామ: పట్టణంలో పట్టపగలే చైన్ స్నాచర్స్ తెగబడ్డారు. శనివారం మధ్యాహ్నం గిర్నిగడ్డ ప్రాంతంలో చోటుచేసుకున్న ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. నిర్మాణంలో ఉన్న ఇంటికి నీళ్లు పడుతుండగా ఓ మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును చైన్‌స్నాచర్లు ఎత్తుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గిర్నిగడ్డకు చెందిన వ్యాపారి పద్మాకర్ తన ఇంటి పక్కనే కొత్తగా మరొక నిర్మాణం చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఆయన భార్య సోమిశెట్టి భాగ్యలక్ష్మి ఇంటికి నీళ్లు పడుతుండగా గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ స్థంభం వద్ద నిలబడి ఫోన్ మాట్లాడుతున్నట్లు నటిస్తూ మహిళను గమనించాడు. కాలనీలో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత సదరు వ్యక్తి తన బైక్‌ను దూరంగా నిలిపి, ఒంటరిగా ఉన్న మహిళ ఇంటి వద్దకు వెళ్లాడు. భాగ్యలక్ష్మి అప్రమత్తమయ్యేలోపే దొంగ ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. ఆమె పెద్దఎత్తున అరుపులు, కేకలు వేసినప్పటికీ దొంగ చాకచక్యంగా అక్కడి నుంచి తప్పించుకున్నాడు. ఘటనలో భాగ్యలక్ష్మి మెడకు స్వల్ప గాయాలయ్యాయి.



గణపతి బప్పా మోరియా.. కావాలయ్యా యూరియా!

తమ దగ్గరికి వచ్చిన వినాయకుడికి మొరపెట్టుకున్న రైతులు

రోజుల తరబడి తిరుగుతున్నా బస్తాకూడా దొరకడం లేదని ఆవేదన ● నవరాత్రి ఉత్సవాల వేళ ఉమ్మడి జిల్లా రైతుల చెంతకు..!

● క్యూ లైన్లో కర్షకుల కష్టాలు చూసి చలించిన గణపయ్య

(వరంగల్ డెస్క్)

చవితి రోజు ఘనంగా పూజలందుకున్నాడు వినాయకుడు. రైతులు ప్రేమగా తెచ్చిన పత్రి, పూలు ఒంటినిండా ధరించాడు. పండ్లు, ఉండ్రాళ్లు బొజ్జ నిండా తిన్నాడు. కుటుంబ సమేతంగా వచ్చిన రైతు దంపతులను చూసి మురిసిపోయాడు. తెల్లవారి సైతం అదే రీతిన ప్రసాదాలు, పండ్లు అందాయి. కానీ.. మనసులో ఏదో వెలితి.

అప్పుడు వినాయకుడు మూషిక రాజు చెవిని మెలిపెడుతూ..



'మూషికా.. నిన్న భక్తజన సందోహంతో నిండిన మండపాల్ని చూసి మురిసిపోయా.. ఇలా తెల్లారిందో లేదో పల్లెల్లోని మండపాలన్నీ వెలవెలబోతున్నాయి. రైతులు, అమ్మలు, అక్కలంతా ఎటు పోయారు? ఒక్కరూ కనిపించరేం..? రైతన్నలెందుకు పూజకు రాలేదో చూసి రాపో' అన్నాడు. (గంట తరువాత) 'స్వామీ.. రైతులు కుటుంబంతో సహా యూరియా కోసం సొసైటీ కార్యాలయాల వద్ద ఉంటున్నారు.. అయినా దొరకట్లేదట.. ఆందోళనలు చేస్తున్నారు.. అని బాధపడుతూ సమాధానమిచ్చాడు. 'నా రైతులు ఇంతగనం కష్టాలు పడుతున్నారా.. వారి కష్టాలు తెలుసుకుందాం పద' అన్నాడు. 'నా భుజంపై ఎక్కండి. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల దగ్గరికి తీసుకెళ్తా' అంటూ సమాధానమిచ్చాడు మూషిక రాజు. సరే పదా.. అంటూ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి వారి ప్రయాణం మొదలైంది.

స్టేషన్‌ఘన్‌పూర్



రైతుల పంటలను చూసుకుంటూ వెళ్తున్నారు. జిట్టిగూడెం గ్రామంలో ఓ రైతు కనిపించాడు. అక్కడే ఆగిన వినాయకుడు.. ఆ రైతును పలకరించాడు.

ఏమయ్యా.. నీ పేరేమిటీ?

స్వామి.. నాపేరు లకావత్ సురేందర్

వినాయకుడు: పొలం ఎట్లుంది? యూరియా దొరకట్లే..

సురేందర్: స్వామి నాకు ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఐదెకరాలు వరి, ఒక ఎకరం పత్తి సాగు చేస్తున్నా. యూరియా బస్తాల కోసం పదిరోజుల నుంచి పనులు వదులుకుని రోజూ ఘన్‌పూర్‌కు వస్తున్నా. ఘన్‌పూర్ ఆగ్రోస్ సెంటర్‌లో శుక్రవారం స్టాక్ వచ్చిందని తెలుసుకుని ఉదయం వెళ్లా. మధ్యాహ్నం వరకు ఎండలో లైన్‌లో ఉన్నా యూరియా దొరకలేదు. లాభం లేదని ఇంటికి వచ్చా. 'అయ్యో.. సురేందర్.. ఇన్ని కష్టాలా'.. అని అనుకుంటూ వినాయకుడు తన మూషికాన్ని కదిలిస్తూ మరో ఊరికి బయల్దేరాడు.

వెల్లంపల్లి



చల్వాయినుంచి పోదాం అంటూ బయలుదేరిన వినాయకుడికి మార్గమధ్యలో హనుమకొండ జిల్లా పరకాల మండలం వెల్లంపల్లిలో ఓ రైతును పలకరించాడు.

వినాయక : రైతన్నా నీపేరేంది?..

రైతు : ఓదెల కొమురయ్య స్వామి..

వినాయక : దిగులుగా ఉన్నావు ఏమైంది.. పొలానికి వెళ్లలే..

కొమురయ్య : యూరియా దొరకడం లేదయ్యా.. వారం రోజుల క్రితం పరకాల పీఏసీఎస్‌లో ఇచ్చారు. ఇప్పుడు అడిగితే మాదారం సొసైటీ వారు సంబంధిత గ్రామాల రైతులకు ఇస్తున్నారు. పరకాల సొసైటీకి ఎప్పుడు వస్తదని అడిగితే ఆర్డర్ పెట్టినం అంటున్నారే తప్ప రావడం లేదు. బజార్‌లో వ్యాపారస్తులు అమ్ముకోవడానికి యూరియా ఉంటుంది కానీ వారు లింక్‌లు పెట్టి అమ్ముతున్నారు.

వినాయక : అవునా.. ఏమిటీ మూషికా.. ఏ రైతన్నను పలకరించినా ఒకటే సమస్య.. వీరి కష్టాలు త్వరగా తీరాలి.. ముఖంలో నవ్వు రావాలి అంటూ తన మండపానికి వెళ్లారు.

చల్వాయి



నేరుగా.. ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం చల్వాయి గ్రామానికి చేరుకున్నారు.

అరుగుపై దిగాలుగా కూర్చున్న కృష్ణారెడ్డిని పలకరిస్తూ..

వినాయకుడు : ఎందుకిలా దిగాలుగా కూర్చున్నావు?

కృష్ణారెడ్డి: 16 ఎకరాల్లో వరి సాగు చేశా. 20 రోజుల క్రితమే పంటకు యూరియా వేయాలి. కొరత కారణంగా ఇప్పటి వరకు వేయలేదు. అదిగో, ఇదిగో బస్తాలు వస్తున్నాయంటూ అధికారులు రైతులను మభ్యపెడుతున్నారు. ఇప్పటికీ నాలుగు సార్లు క్యూలైన్‌లో నిల్చుంటే ప్రతీసారి ఒకటి లేదా రెండు బస్తాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. పంటలకు సరిపడా యూరియా ఇవ్వట్లేదు. అధికారులు సరిపడా యూరియా పంపిణీ చేస్తారనే ఆశ కూడా రైతుల్లో లేదు. ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి పెట్టా. అని చెప్పగానే. ఇంతదారుణమా అంటూ అక్కడినుంచి వినాయక స్వామి పరకాల మీదుగా వెళ్దామని బయలుదేరారు.

నల్లబెల్లి



భళా.. ఏమిటీ ఇక్కడి రైతులంతా ఆనందంగా ఉన్నట్టున్నారే.. అన్ని చోట్లా కనిపించినట్లు. ఇక్కడ క్యూలైన్ లేదు. తోపులాట లేదు. పోలీసుల హడావిడి లేదు అంటూ.. నల్లబెల్లి మండలకేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట నుంచి వెళ్లిపోబోయాడు వినాయకుడు. అప్పుడే ఒక రైతు కాళ్లీడుస్తూ.. పీఏసీఎస్ వైపు రావడం గమనించారు.

'ఏంటయ్యా.. ఇక్కడ యూరియా కొరత లేనట్టుంది. నువ్వేటు వెళ్తున్నావ్' అని నల్లబెల్లి మండలం గోవిందాపూర్ శివారు ఎర్రచెరువు తండాకు చెందిన పాడ్యా బాలును అడిగాడు వినాయకుడు.

బాలు: ఈ సీజన్‌లో మూడెకరాల్లో వరి, మరో మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. యూరియా కోసం 12 రోజులుగా తిరుగుతున్నా. మండలంలో ఏషాపునకు వెళ్లినా యూరియా లేదు. అయిపోయిందని చెబుతున్నారు. స్టాక్ లేదని చెబుతున్నా.. ఒక్క బస్తా అయినా దొరుకుతుందేమోనని రోజూ పీఏసీఎస్‌కు వచ్చి పోతున్నా.' అని సమాధానమిచ్చాడు. .. రైతులకు యూరియా కష్టాలు తీరేదెన్నడో అంటూ ముందుకు కదిలాడు వినాయకుడు.

గూడూరు



సూర్యుడు నడినెత్తిమీదికొచ్చేసరికి వినాయకుడు గూడూరు మండల కేంద్రానికి చేరుకున్నాడు. పీఏసీఎస్ గోదాం వద్ద లైన్‌లో నిల్చున్న మత్రిమిట్టలోని బందాల గడ్డ తండాకు చెందిన భూక్య హేమ్లానాయక్‌ను పలకరించాడు.

వినాయకుడు: ఏమిటీ హుషారుగా ఉండేవాడివి.. నిస్సత్తువగా కనిపిస్తున్నావ్.

హేమ్లానాయక్: ఏం చెప్పాలి స్వామి. ఆరు ఎకరాల్లో వరి సాగు చేశా. 20 రోజులవుతోంది. ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా యూరియా దొరకలేదు. 10 రోజులుగా నిత్యం నా భార్య, నేనూ యూరియా కోసం వస్తున్నాం. తీసుకున్న వాళ్లే మళ్లీ మళ్లీ తీసుకుంటున్నారు. మా లాంటి వాళ్లను పట్టించుకునేటోళ్లు లేరు. కనీసం ఎకరానికి ఒక బస్తా చొప్పున 6 బస్తాలు కావాలి. ఏం చేయాలో తోచట్లేదు. లైన్‌లో నిలబడి, రాత్రి, పగలు తిరుగుతూ ఉంటే జ్వరం వచ్చింది. 'అయ్యో.. హేమ్లా. ఒంట్లో జ్వరమున్నా.. పంటను కాపాడుకోవాలన్న నీ తాపత్రయం బాగుంది. ఆరోగ్యం జాగ్రత్త. అంటూ వినాయకుడు అక్కడి నుంచి బయల్దేరాడు.

చెన్నారావుపేట సొసైటీ ఎదుట బారులుదీరిన రైతులు





మహబూబాబాద్ జిల్లా కురవి మండలం ఆంధ్రా బ్యాంకు కర్షక సేవా సహకార సంఘం వద్ద చేతిలో చిట్టీ పట్టుకుని తిరుగుతున్న మోద్గులగూడేనికి చెందిన రైతు కొత్త వెంకన్నగౌడ్‌ను ఆపి 'ఎందుకలా తిరుగుతున్నావ్. ఏంటి సమస్య' అని ప్రశ్నించాడు వినాయకుడు

వెంకన్నగౌడ్: స్వామీ.. నేను మూడెకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. పంట కోసం ఆరు బస్తాల యూరియా కావాలి. ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా దొరకలేదు. వారం రోజులుగా కాళ్లరిగేలా తిరుగుతున్నా. కష్టపడి కూపన్ సంపాదించా. కూపన్ చేతికొచ్చినా యూరియా అందలేదు. మరో రెండు రోజుల్లో లారీ వస్తుందని చెబుతున్నారు. అప్పుడైనా దొరుకుతుందో లేదో' అని నిట్టూరుస్తూ సమాధానమిచ్చాడు. 'దేశానికి అన్నంపెట్టే రైతుకే ఇన్ని కష్టాలా?' అనుకుంటూ ముందుకు సాగారు మూషికరాజు, వినాయకుడు.

కురవి

కొత్తగూడలో క్యూలో ఉన్న రైతులు, సొమ్మసిల్లి పడిపోయిన మల్లెల రామక్క



మానుకోట,వరంగల్ జిల్లాల్లో రైతుల బారులు, ఆందోళనలు చూసి చలించిపోయాడు వినాయకుడు. నర్సంపేట, చెన్నారావుపేట, కేసముద్రం మండలం కల్వాల రైతు వేదిక వద్ద రైతుల తోపులాట, నర్సింహులపేట పీఏసీఎస్ వద్ద రైతులు చేస్తున్న రాస్తారోకో, గూడూరు మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్ జాతీయ రహదారి 365పై ఆందోళన, కురవి, కొత్తగూడలో యూరియా కోసం వచ్చిన మహిళలు స్పృహతప్పి కిందపడిపోవడం చూసి నా రైతన్నలకు ఇన్ని కష్టాలా.. పాలకులేమి చేస్తున్నరు అంటూ లోలోన మదన పడుతూ ముందుకు సాగాడు.

సండే స్పెషల్

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ

జనగామ రూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌పై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ మొత్తంలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. డీసీపీ బి.రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ..జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పెండింగ్‌లో ఉన్న రాజీపడ తగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకునేలా కక్షిదారులకు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, ఇ.సుచరిత, జూనియర్ సివిల్ జడ్జి శశి, ఆర్డీఓ కె.గోపిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.సుహాసిని, ఏసీపీలు ఎ.నర్సయ్య, ఆర్. భీమాశర్మ, ప్లీడర్ రామ్మోహన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరిచంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కోఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

● కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

లింగాలఘణపురం: విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం మండలంలోని నెల్లుట్ల పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. పదో తరగతి, ప్రీప్రైమరీ విద్యార్థులతో మాట్లాడారు.. ప్రైమరీ విద్యార్థులతో బోర్డుపై ఉన్న పదాలను చదివించి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని, అప్పుడే మంచి మార్కులు సాధిస్తారని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందో పరిశీలించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. హెడ్మాస్టర్లు రవీందర్, సమ్మక్క తదితరులు ఉన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఎన్‌సీడీ నుంచి మినహాయించండి

● డీఎంహెచ్ఓకు ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏల వినతి

జనగామ: ప్రభుత్వం ఎన్‌సీడీ ఆన్‌లైన్ ప్రోగ్రాం నుంచి ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏలను మినహాయించాలని కోరుతూ శనివారం జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్ రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం దేవేంద్ర, ఎ.శారద, ఎన్.పద్మావతి, అమృత, వసంత, సవిత, జ్యోతి, కుల్సూమ్ సుల్తాన్ మాట్లాడుతూ.. ఎన్‌సీడీకి సంబంధించి 2014లో స్టేట్ లెవల్ అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్(ఎన్‌సీడీ) చేసిన తర్వాత 2017, 2022 రీ స్క్రీనింగ్ సైతం చేశామన్నారు. 2022 సంవత్సరంలో సైతం చేసినట్లు స్పష్టం చేశారు. 2025లో మరో యాప్‌ను కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చి గత వివరాలను నమోదు చేయాలనడం భావ్యం కాదన్నారు. ఒకే పనిని రెండు, మూడుసార్లు చేయిస్తుండడంతో తమకు అప్పగించిన వైద్యసేవలను పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నామన్నారు. ఉన్నతాధికారులు తమ సమస్యను మానవతా దృక్పథంతో ఆలోచించి విముక్తి కలిగించాలన్నారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న చేస్తున్న ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌ఏలు

'డబుల్' ఇళ్ల పంపిణీలో వసూళ్లు?

● ఉన్నతాధికారుల ఆదేశాలు లేకున్నా పట్టాల పంపిణీ

● తహసీల్దార్ సెలవులో ఉండగా గుట్టుచప్పుడు కాకుండా..

తరిగొప్పుల: గత ప్రభుత్వం గూడులేని నిరుపేదల ఆవాసం కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాల పంపిణీలో కొందరు వసూళ్లకు పాల్పడినట్లు మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మండలంలోని అక్కరాజుపల్లి గ్రామంలో అప్పటి ప్రభుత్వం 2020లో 30డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. కాగా లబ్ధిదారులు ఎంపిక కోసం రెవెన్యూ అధికారులు పలుమార్లు గ్రామసభలు నిర్వహించారు. అయినప్పటికీ తుది జాబితా కొలిక్కిరాకపోవడంతో లబ్ధిదారుల ఎంపిక నిలిపివేశారు. ఇదిలా ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాలు లేనప్పటికీ తహసీల్దార్ సెలవులో ఉండగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా రెవెన్యూ సిబ్బంది ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. కాగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం ఏంటని రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో అప్పటికే 21 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయగా 9 మందికి పంపిణీ చేయలేదు. కాగా, లబ్ధిదారుల్లో ఒక్కరైనా ఓ మహిళా లబ్ధిదారుకు ఫోన్ చేసి పట్టాలు పంపిణీ చేస్తున్న రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని చెప్పి రూ.10 వేలు వసూలు చేసినట్లు సమాచారం. ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆంధ్రయ్యను వివరణ కోరగా కలెక్టర్ సూచన ఆదేశాల మేరకు తహసీల్దార్ సూచన మేరకే ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, ఎవరి నుంచి డబ్బులు వసూలు చేయలేదన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇల్లు ఇప్పించండి సారూ..

ఎప్పుడూ కూలుతుందో తెలియని పెంకుటింటిలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న తనకు ఇల్లు ఇప్పించాలని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన బొమ్మెన రేణుక అనే మహిళ శనివారం కలెక్టర్‌ను వేడుకునేందుకు వెళ్లగా పోలీసులు ఆమెను గేటు వద్ద అడ్డుకున్నారు. తన వెంట తెచ్చుకున్న సంచిని తనిఖీ చేశారు. పలుమార్లు ప్రజావాణిలో దరఖాస్తు పెట్టుకున్నానని అయినప్పటికీ తనకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త మృతి చెందాడని, కొడుకు, కూతురుతో కాలం వెళ్లదీస్తున్న తనని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంది.

లంబోదరుడికి 108 రకాల నైవేద్యాలు



గణేషుడికి సమర్పించిన 108 రకాల నైవేద్యాలు

జనగామ: పట్టణంలోని పాత బీటు బజార్‌లో గణేశ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం స్వామివారికి 108రకాల నైవేద్యాలను సమర్పించారు. అలాగే గణేశుడు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కేంద్ర ఆర్థిక పథకాలతో మహిళల స్వావలంబన

● ఆర్‌బీఐ జీఎం ఎంజీ సుప్రభాత్

పాలకుర్తి టౌన్: సామాజిక ఆర్థిక భద్రత పథకాలతో గ్రామీణ మహిళలు స్వావలంబన సాధించేందుకు బ్యాంకులు పనిచేస్తున్నాయని ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ ఎంజీ సుప్రభాత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మండపంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోషల్ సెక్యూరిటీ స్కీమ్ విలేజ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, సంతృప్త ప్రచార కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు కేవైసీ అప్‌డేట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేంద్రన్‌తో కలిసి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సురక్ష బీమా యోజన, జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు పరిధిలో గల 33 మహిళ సంఘాలకు రూ.4కోట్ల రుణాల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఎన్‌బీ సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ సుజిత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ వసంత, ఏపీడీ నూరోద్దీన్, పీఎన్‌బీ మేనేజర్ అడేపు రమేశ్, డీసీఎం శ్రీనివాస్, ఏపీఎం శ్రీరాములు, చంద్రశేఖర్ సీసీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులకు రుణపత్రాలను అందజేస్తున్న ఆర్‌బీఐ జీఎం ఎంజీ సుప్రభాత్, పీఎన్‌బీ ఈడీ సురేంద్రన్

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

● అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ రూరల్: అధికారులు పాఠశాలల నిర్వహణపై దృష్టిపెట్టాలని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, హాజరుపట్టికలను పరిశీలించారు. అధికారులతో పర్యవేక్షిస్తూ పాఠశాల ఆవరణ, వంటగదిని సందర్శించి పరిశుభ్రతను పరిశీలించారు. పిల్లలకు సదుపాయాల కల్పనలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట విద్యాశాఖ అధికారులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా 8 ఫెస్టివల్ ట్రైన్లు

- సెప్టెంబర్ 7 నుంచి అమలు..

కాజీపేట రూరల్ : వినాయకచవితి, దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా 8 ఫెస్టివల్ స్పెషల్ ట్రైన్లు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం తెలిపారు.

ఫెస్టివల్ ట్రైన్ల వివరాలు..

సెప్టెంబర్ 7 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు ప్రతీ ఆదివారం చర్లపల్లి–హజ్రత్ నిజాముద్దీన్ (07023) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 9 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు హజ్రత్‌నిజాముద్దీన్–చర్లపల్లి (07024) ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం, సెప్టెంబర్ 3 నుంచి నవంబర్ 26వ తేదీ వరకు చర్లపల్లి–రక్సోల్ (07007) ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం, సెప్టెంబర్ 5 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు రక్సోల్–చర్లపల్లి (07008) ఎక్స్‌ప్రెస్ ప్రతీ శనివారం, సెప్టెంబర్ 2 నుంచి నవంబర్ 25వ తేదీ వరకు చర్లపల్లి–డెహ్రాడూన్ (07077) ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళవారం, సెప్టెంబర్ 4 నుంచి నవంబర్ 27వ తేదీ వరకు డెహ్రాడూన్–చర్లపల్లి (07078) ఎక్స్‌ప్రెస్ ప్రతీ శుక్రవారం, అక్టోబర్ 4 నుంచి నవంబర్ 29వ తేదీ వరకు చర్లపల్లి–రక్సోల్ (07051) ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళవారం, అక్టోబర్ 7 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు రక్సోల్–చర్లపల్లి (07052) ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుని వెళ్లనున్నట్లు రైల్వే సీపీఆర్వో తెలిపారు.

ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో అరుదైన చికిత్స



సత్యనారాయణకు చికిత్స చేస్తున్న వైద్యులు

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో శనివారం అరుదైన చికిత్స నిర్వహించారు. ఆయుర్వేద వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తుమ్మ మధు బృందం ఆధ్వర్యంలో 'టీనో సైనువైటీస్' అనే వ్యాధికి 'అగ్నికర్మ' చికిత్స నిర్వహించారు. వరంగల్ 34 డివిజన్ శివనగర్‌కు చెందిన సత్యనారాయణ 'ట్రిగ్గర్ ఫింగర్ టీనో సైనువైటీస్' అనే నరాల వ్యాధితో ఐదు నెలల నుంచి బాధపడుతున్నాడు. అల్లోపతి వైద్యులను సంప్రదించి ఎన్నో మందులు వాడినా ఫలితం లేదు. నరాల కదలిక ఆగిపోవడం, ఆ ప్రాంతంలో అధిక నొప్పితో సత్యనారాయణ.. ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్‌లను సంప్రదించగా ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ ఖర్చుతో కూడి ఉండడంతో వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో తుమ్మ మధును సంప్రదించారు. దీంతో 'టీనో సైనువైటీస్' అనే వ్యాధికి 'అగ్నికర్మ' అనే చికిత్స చేశారు. తద్వారా వారానికి ఒకటి చొప్పున ఆరు పర్యాయాలకు రెండో దశలో చేతి వేలుకు కదలిక వచ్చింది. ఈ వ్యాధి లక్షణం కండరంలో వాపు ఉంటుందన్నారు. దీని వల్ల వేలు కదలికలు మందగిస్తాయని, నొప్పి తీవ్రంగా ఉంటుందని, చికిత్స అనంతరం ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు తెలిపారు. ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేద వైద్యంలో ఖర్చు లేకుండా నయం చేయొచ్చని నిరూపించామని వైద్యులు పేర్కొన్నారు. ఈ చికిత్సలో సర్జన్లు మేఘన, కేతన, శివాని హరినాథ్ తదితరులు ఉన్నారు.

త్వరలోనే 'పంచాయతీ'!

సెప్టెంబర్ 2న జీపీల్లో ఫైనల్ ఓటర్ల జాబితా

- మరో మూడు రోజుల్లోనే అన్నీ.. చురుగ్గా ఓటర్ల సవరణ ప్రక్రియ
- సీఈసీ ఆదేశాల మేరకు యాక్షన్‌ప్లాన్ అమలు
- రాజకీయ పార్టీల నేతలతో ముగిసిన సమావేశం
- 31న డీపీఓల కీలక సమావేశం.. ఆ తర్వాత ఓటర్ల జాబితా ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో 30,43,540 ఓటర్లు.. అత్యధికంగా మహిళలు 15,51,289
- ఓటర్ల సవరణ షెడ్యూల్‌తో పల్లెల్లో వేడెక్కిన రాజకీయం



సాక్షిప్రతినిధి, వరంగల్: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైనట్లేనా? లోకల్ బాడీస్ ఎన్నికల విషయంలో ప్రభుత్వం స్టాండ్ మారిందా? మొదటగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలకున్నా.. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికల వైపు మొగ్గు చూపుతుందా? ఈ దిశగానే ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తుందా? అంటే.. నిజమే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు కూడా ఇవే సంకేతాలిస్తున్నాయి. రాష్ట్ర కేబినెట్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లో నిర్వహించాలని నిర్ణయించి ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని నిర్ణయించారు. దీంతోపాటు ఎన్నికల్లో రిజర్వేషన్ పరిమితి ఎత్తివేస్తూ 42శాతం రిజర్వేషన్ కోసం ప్రత్యేక జీఓ తేవాలని తీర్మానించింది. దీంతోపాటు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్ జారీ చేసిన నేపథ్యంలో.. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మొదలైంది. గ్రామ పంచాయతీల వారీగా గురువారం ఓటరు జాబితాను అంటించారు. శుక్రవారం కలెక్టర్, ఉన్నతాధికారులు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జిల్లా స్థాయి నాయకులతో ఆయా జిల్లాల కలెక్టరేట్లలో సమావేశమయ్యారు.

ఆరు రోజుల్లోనే అన్నీ..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో వేగం పుంజుకుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఓటరు జాబితాపై ఎస్ఈసీ నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈమేరకు పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఉమ్మడి వరంగల్‌లోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌ను తయారుచేసి సెప్టెంబర్ 2న తుది జాబితా ప్రచురించాలని సూచించారు. ఈమేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28న పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించి.. 28న జిల్లాస్థాయి, 29న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. 28 నుంచి 30 వరకు అభ్యంతరాలు స్వీకరించి, 31న డీపీఓలు ఓటర్ల సవరణ జాబితాపై కీలక సమావేశం నిర్వహించి జిల్లా కలెక్టర్లకు నివేదించనున్నారు. ఆతర్వాత, సెప్టెంబర్ 2న తుది జాబితా ప్రకటించాల్సి ఉండగా.. ఆరు రోజుల్లోనే అన్ని జరిగేలా అధికార యంత్రాంగం పనిచేస్తోంది.

ఉమ్మడి వరంగల్‌లో గ్రామ పంచాయతీలు, వార్డుల వివరాలు

జిల్లా	గ్రామ పంచాయతీలు	వార్డులు	పోలింగ్ కేంద్రాలు
హనుమకొండ	210	1,986	1986
వరంగల్	317	2,754	2,754
భూపాలపల్లి	248	2,102	2,102
మహబూబాబాద్	482	4,110	4,110
ములుగు	171	1,520	1,535
జనగామ	280	2,534	2,534

జనవరి 5న విడుదల చేసిన జాబితా ప్రకారం అసెంబ్లీ నియోజవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు ఓటర్లు	మహిళలు ఓటర్లు	ఇతరులు ఓటర్లు	సర్వీస్	మొత్తం
వరంగల్ పశ్చిమ	1,40,100	1,45,061	16	74	2,85,251
వరంగల్ తూర్పు	1,26,066	1,33,338	341	90	2,59,835
వర్ధన్నపేట	1,35,061	1,40,664	18	184	2,75,927
భూపాలపల్లి	1,36,952	1,41,022	08	203	2,78,185
ములుగు	1,14,504	1,20,730	26	226	2,35,486
జనగామ	1,20,891	1,25,069	10	136	2,46,106
స్టేషన్‌ఘన్‌పూర్	1,26,630	1,30,723	04	173	2,57,530
పాలకుర్తి	1,27,758	1,30,543	14	155	2,58,470
డోర్నకల్	1,10,016	1,14,627	07	183	2,24,833
మహబూబాబాద్	1,27,527	1,33,088	47	197	2,60,859
నర్సంపేట	1,15,838	1,21,487	11	355	2,37,691
పరకాల	1,08,263	1,14,937	02	165	2,23,367

30.43 లక్షల ఓటర్లు.. అందులో మహిళలు 15.51 లక్షలు

2025 జనవరి 5న ప్రకటించిన జాబితా ప్రకారం ఉమ్మడి వరంగల్‌లో ఓటర్ల సంఖ్య 30,43,540కు చేరింది. పురుషులు, మహిళలు, ఇతరులు, సర్వీసు కలిపితే 30.44 లక్షలకు చేరగా.. ఓటర్ల జాబితాలో ఈసారీ మహిళలదే అగ్రస్థానం. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. 12 నియోజకవర్గాల్లో మొత్తం 30,43,540 మంది ఓటర్లు ఉంటే, అందులో పురుషులు 14,89,606 కాగా.. మహిళా ఓటర్లు 15,51,289 ఉన్నారు. ఇతరులు (థర్డ్‌జెండర్) 504 కాగా, సర్వీసు ఓటర్లు 2141. కాగా.. గ్రామ పంచాయతీ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరగనుందని అధికారులు చెబుతున్నారు. కాగా, పార్టీలపరంగా బీసీలకు 42 శాతం అవకాశం కల్పిస్తామన్న ప్రకటనల నేపథ్యంలో ఎక్కడెక్కడ.. ఏయే పదవులకు ఎవరెవరు పోటీచేస్తారు? అన్న సమీకరణలు కూడా జోరందుకున్నాయి.

ఏఐతో పని సరళం..

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. కఠిన పనిని కూడా సరళం చేస్తోందని కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాలలో మూడురోజులుగా నిర్వహించిన 'డేటా డ్రివెన్ టీచింగ్ బిజినెస్ అనాలటిక్స్ అండ్ పవర్ బీఐ ఫర్ ఎడ్యుకేటర్స్' వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అధ్యాపకులకు లెర్నింగ్ నిరంతర ప్రక్రియ అన్నారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం లేదన్నారు. అయితే టెక్నాలజీలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకనుగుణంగా విద్యాబోధనలో పట్టుకలిగి ఉండాలని సూచించారు. విద్యార్థుల అవసరాలకు తగ్గట్లు అధ్యాపకులు నాణ్యమైన విద్యనందించేలా సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ పి. అమరవేణి, డీన్ కె. రాజేందర్, సీడీసీ డీన్ పి. వరలక్ష్మి, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నర్సింహాచారి, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ ప్రగతి, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నేరస్తుడికి ఇరవై ఏళ్ల జైలు

ఏటూరునాగారం : పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ ములుగు జిల్లా కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2022లో ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం ఎలిశెట్టిపల్లిలో ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన గౌస్‌పాషా (కిరాణాషాపు) లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న అనంతరం నేరం రుజువు కావడంతో నేరస్తుడు గౌస్‌పాషాకు న్యాయమూర్తి సూర్య చంద్రకళ 20 ఏళ్ల జైలు శిక్ష రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్సై తెలిపారు.

వేయిస్తంభాల గుడిలో డుండి గణపతిగా అలంకరణ



డుండి గణపతిగా ఉత్తిష్ఠ మహాగణపతి

హన్మకొండ కల్చరల్: హనుమకొండ నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న గణపతినవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం దేవాలయంలోని ఉత్తిష్ఠ మహాగణపతిని చందన రంగులతో డుండిగణపతిగా అలంకరించి దూర్వాపత్రాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం నుంచి రుద్రేశ్వరస్వామివారికి రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. ఉత్తిష్ఠగణపతికి ప్రాచీన కోనేరునీటితో జలాభిషేకం నిర్వహించి డుండి గణపతిగా అలంకరించారు. ఉత్సవ గణపతి విగ్రహానికి షోడశోపచారపూజలు జరిగాయి. ఉత్సవమూర్తికి నందివాహనసేవ నిర్వహించారు. యాగశాలలో గణపతినవగ్రహ పాశుపత హోమం, లక్ష్మీగణపతి మూలమంత్రహోమం, సహస్రమోదక హోమం నిర్వహించారు. వందలాది మంది భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. పూజాకార్యక్రమాల్లో దాత వేముల ఉమాదేవి, సేవాసమితి సభ్యులు గంధ్రాతి రాజు, పులి రజనీకాంత్, చొల్లేటి కృష్ణమాచారి, గరిగె అశోక్ పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు జరిగాయి. బోడిగె లక్ష్మీనారాయణ భాగవతార్‌తో హరికథాపారాయణం నిర్వహించారు. ఆలయ ఈఓ అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉగ్ర గోదావరి..

- కాళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటిప్రమాద హెచ్చరిక
- పుష్కరఘాట్ వద్ద 12.550 మీటర్ల ఎత్తులో నీటిమట్టం
- అన్నారం బ్యారేజీకి 8.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మేడిగడ్డ బ్యారేజీకి 10.25 లక్షల క్యూసెక్కులు..
- నీట మునిగిన పంటలు



కాళేశ్వరం వంతెన వద్ద గోదావరి ప్రవాహం



నాగేపల్లి వద్ద నీట మునిగి చెరువును తలపిస్తున్న పత్తిపంట

కాళేశ్వరం: ఎగువన కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం బ్యారేజీకి 8.55 లక్షల క్యూసెక్కుల నీరు తరలి వస్తోంది. దీంతో బ్యారేజీలో మొత్తం 66గేట్లు ఎత్తి నీటిని దిగువకు అదేస్థాయిలో కాళేశ్వరం వైపునకు తరలిస్తున్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద మహారాష్ట్ర నుంచి తరలొస్తున్న ప్రాణహిత నదితో కలిసి గోదావరి వరద ప్రవాహం పుష్కర ఘాట్లను తాకుతూ 12.550 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు తరలుతోంది. శుక్రవారం ఉదయం నుంచి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కొనసాగుతోంది. ఇప్పటికే గోదావరి ఒడ్డున పలు దుకాణాలు, హోటళ్ల వద్దకు నీరు చేరింది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి 10.25లక్షల క్యూసెక్కులు తరలి రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం సమీపంలోని చంద్రుపల్లి వాగు గోదావరి కమ్మేయడంతో రాకపోకలు నిలిచాయి. అన్నారం, కాళేశ్వరం, మహదేవపూర్ వరకు వందల ఎకరాల్లో పత్తి పంట నీటమునిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

- నర్సంపేటలో ఘటన

నర్సంపేట రూరల్ : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో చోటు చేసుకుంది. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా మధిర గ్రామానికి చెందిన బెజవాడ సోమశేఖర్ (37)కు వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట గ్రామానికి చెందిన అశ్వినితో సుమారు ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. సోమశేఖర్ హనుమకొండలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, అశ్విని ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లోని కస్తూర్బాలో కాంట్రాక్ట్ పద్ధతిలో గణితశాస్త్ర లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో సోమశేఖర్ మద్యానికి బానిసవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి కూడా గొడవ జరిగింది. రోజుమాదిరిగానే అశ్విని శుక్రవారం ఉదయం విధులకు వెళ్లింది. రాత్రివేళలో కూడా హాస్టల్‌లో డ్యూటీ ఉండడంతో అక్కడే ఉంది. పిల్లలు అమ్మమ్మ ఇంటికి వెళ్లగా సోమశేఖర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం ఇంటి ఆవరణలోని లైట్ వెలిగి ఉండడంతో స్థానికులు వచ్చి చూడగా సోమశేఖర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వారు వెంటనే భార్య, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై రవి కుమార్ ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీపీఎం నాయకుడిపై డాక్టర్ దాడి

- ఆందోళనకు దిగిన బంధువులు, నాయకులు
- జనగామ జిల్లా ఆస్పత్రిలో ఉద్రిక్తత.. రంగంలోకి పోలీసులు



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జనగామ: తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఓ మహిళను శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా..ఓపీ పేరు నమోదు సమయంలో పేషెంట్ తరపున వచ్చిన సీపీఎం నాయకుడిపై డాక్టర్ దాడికి పాల్పడ్డాడు. సీపీఎం నాయకుడు బొట్ల శేఖర్, బాధితుడి బంధువుల కథనం ప్రకారం.. లింగాలఘణపురం మండలం సిరిపురం గ్రామానికి చెందిన దుర్గి పూలమ్మ వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైంది. అదే మండల సీపీఎం కార్యదర్శి బొడ్డు కరుణాకర్ సదరు మహిళను వెంటనే జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. పూలమ్మ పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే పేరు నమోదు చేసుకుని అడ్మిట్ చేసుకోవాలని డాక్టర్ స్నేహిత్‌ను కోరారు. ఓపిక లేదా.. ఆగలేరా.. అంటూ డాక్టర్ దురుసుగా ప్రవర్తిస్తూ పైకి రావడంతో రోగి బంధువులతో పాటు కరుణాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సదరు డాక్టర్ సహనం కోల్పోయి తన చేతిలో ఉన్న ఓ పాయిజన్ డబ్బాను విసరడంతో కరుణాకర్ ఛాతీ, కడుపులో బలంగా తాకగా అస్వస్థతకు గురయ్యాడు. డాక్టర్ ప్రవర్తనను నిరసిస్తూ సీపీఎం నాయకులు బొట్ల శేఖర్, జోగు ప్రకాశ్‌తో పాటు బంధువులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై రాజేశ్, చెన్నకేశవులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. అనంతరం వైద్యుడు స్నేహిత్‌పై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజలింగం మాట్లాడుతూ.. ఘటనపై ఆర్ఎంఓ మధుకర్, మరో డాక్టర్‌తో కలిసి విచారణ కమిటీ నియమించామన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని చెప్పారు.

సమాచారం ఇవ్వడంలో జాప్యమెందుకు?

- సమాచారం పొందడం పౌరుల హక్కు
- సద్వినియోగం చేసుకుంటే సుపరిపాలన
- చట్టాన్ని దుర్వినియోగం చేయడం నేరం
- రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు



మాట్లాడుతున్న ఆర్‌టీఐ కమిషనర్ అయోధ్యరెడ్డి

సాక్షి, మహబూబాబాద్ : దాపరికం లేని పాలన, సంక్షేమ పథకాల్లో పారదర్శకత పెంపొందించడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరులు అడిగిన సమాచారం ఇవ్వడంలో జాప్యం ఎందుకు చేయాలి? దాపరికం ఎందుకని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాస్, మోహ్సినా పర్వీన్, దేశాల భూపాల్ అన్నారు. శనివారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి జిల్లాలోని పీఐఓఎస్, ఏపీఐఓఎస్ అన్ని విభాగాల అధికారులతో సమీక్షించారు. అనంతరం జిల్లాలోని పెండింగ్ ఫిర్యాదులపై అర్జీదారులు, అధికారులతో చర్చించారు. 12 శాఖలకు సంబంధించి 115 అప్పీళ్లను నలుగురు కమిషనర్లు పరిష్కరించారు. అనంతరం వారు విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. రెండున్నర సంవత్సరాలుగా కమిషన్ లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 18వేల అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటికి పరిష్కార మార్గం చూపుతూ.. ప్రజలు, అధికారుల్లో మరింత అవగాహన పెంచేందుకు కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తోందని చెప్పారు. ఇప్పటి వరకు 10 జిల్లాల్లో పర్యటించి 4వేలకు పైగా ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. పెండింగ్ దరఖాస్తుల్లో అత్యధికంగా రెవెన్యూ, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖలవే ఉన్నాయని చెప్పారు. ఇందులో మహబూబాబాద్ జిల్లాలో 160 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చట్టానికి లోబడి ఉన్న ఫిర్యాదులకు సమాచారం ఇవ్వాలని, సాకుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. ఇలాంటి పరిస్థితి వస్తే సెకండ్ అప్పీల్‌కు వెళ్లొచ్చని సూచించారు. చట్టం ప్రకారం సమాచారం ఇవ్వకపోతే సెక్షన్ 20 అనుసరించి సదరు అధికారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా సమాచారం అడిగే వారు కూడా అనవసర విషయాల జోలికి వెళ్లొద్దని సూచించారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటే సుపరిపాలన అందించొచ్చని చెప్పారు.

ఒడిశా టు గోదావరిఖని..

- గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్, ఐదుగురు పరార్
- రూ. 15 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ




వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, పక్కన సీఐ, ఎస్సై

వాజేడు: ఒడిశా నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేయగా ఐదుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.15 లక్షల విలువైన 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వివరాలు వెల్లడించారు. గోదావరి ఖనిలోని 8ఇంక్లైన్ కాలనీకి చెందిన తొగరి విష్ణువర్ధన్, జెంజర్ల రేవంత్, మేకల మహేందర్, అజయ్, జెంజర్ల రోహిత్, జెజర్ల బాలాజీ, రుత్విక్ స్నేహితులు. వీరు గంజాయి సేవించడంతో పాటు గోదావరిఖని చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కువ డబ్బులకు అమ్ముతూ జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 18న ఒడిశాకు వెళ్లి అక్కడ ఓ వ్యక్తి వద్ద రూ. 15 లక్షల విలువైన 30 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. సరుకును బ్యాగుల్లో సర్దుకుని నాలుగు బైక్‌లపై శనివారం వెంకటాపురం(కె) వైపు నుంచి ఏటూరు నాగారం వైపునకు వస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు హైవేపై వాజేడు ఎస్సై సతీశ్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో నాలుగు బైక్‌లు అక్కడికి రావడంతో పోలీసులకు అనుమానం వచ్చి మొదటి బైక్‌పై ఉన్న ఇద్దరిని పట్టుకున్నారు. దీనిని వెనుక మూడు బైక్‌లపై ఉన్న వారు గమనించి తమ వద్ద ఉన్న బ్యాగులను పడేసి పరారయ్యారు. ఆ బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో తొగరి విష్ణువర్ధన్, జెంజర్ల రేవంత్‌ను అరెస్ట్ చేయగా మేకల మహేందర్, కొల్లి అజయ్, జెంజర్ల బాలాజీ, రుత్విక్ , జెంజర్ల రోహిత్ పరారైనట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో వెంకటాపురం (కె) సీఐ ముత్యం రమేశ్, వాజేడు ఎస్సై జక్కుల సతీశ్ ఉన్నారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్ట్..

- మహిళ మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు పవన్‌కుమార్, శశాంక్

కాళేశ్వరం: ఓ మహిళను హత్య చేసి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్‌కుమార్ శనివారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఈ ఏడాది జనవరి 1వ తేదీన మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన ఒల్లాల రవికుమార్ తన తల్లి భాగ్యలక్ష్మి (51) గతేడాది డిసెంబర్ 27 నుంచి కనిపించడం లేదని మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, భాగ్యలక్ష్మి వద్ద డబ్బులు ఉన్నట్లు మల్హర్ మండలం వల్లంకుంట గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి రామయ్య అలియాస్ రాంరెడ్డి గమనించాడు. ఈ క్రమంలో సదరు మహిళను నమ్మించి భూపాలపల్లి దగ్గరలోని కమలాపూర్ ఎక్స్ రోడ్ నుంచి కొద్ది దూరంలో ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేశాడు. ఎలాంటి ఆధారం లేకుండా మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టాడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతుండగా పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో క్లూస్ టీమ్ ఆధారాల మేరకు సెల్ ఫోన్ సిగ్నల్, కాల్ డేటా, సీసీ కెమెరాలు పరిశీలించి శనివారం రాంరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఎస్సై శశాంక్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

MEDICAL TRANSCIPTION

- **MLT, MPHW(F)** చదివిన విద్యార్థులకు DMLT, DMSTలో చదువు + ప్రాక్టికల్ + ఉద్యోగం కలదు. సెల్: 9177631014, 9849819819. [SCA25007614]

REAL ESTATE

TO-LET

- **3-BHK, GopiKrishna Residency** Flat No.506, H.No.5-9-11, Flat Rent. Kishanpura, Hanamkonda. Cell: 9959389999, 9390105601. [WA-6763]

PLOT FOR SALE

- కేవలం 500 EMI తో 121 గజాల పండ్ల మొక్కలతో రిసార్ట్ ఫెసిలిటితో పక్కా డాక్యుమెంట్స్ గల ప్లాట్ మీ సొంతం. సంప్ర॥ 9390111828, 9618372299. [SCA25007693]
- **413 Sq.yards, Near Vegetable** Market, S/E Corner, Kazipet. 170 Sq.yards at Venkatadri Nagar, East Kazipet. Cont. 9398783805. [M-13916]
- **2 Plots for Sale. Each** Measuring 500 sq.yds E/F MainRoad Rampur Hanamkonda, Opp: Bharath Petrol Pump. Ph. 8977727776. [HA-01299]
- హన్మకొండ కిట్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రక్కన, బస్వారెడ్డి టౌన్‌షిప్ 1st లైన్‌లో 530 Sq.Yds ఓపెన్ ప్లాట్ అమ్మబడును. సంప్ర. 99634 15800. [SCA25007717]

SERVICES

హోమియో క్లినిక్

- సంతానం కావాలా ? హోమియో వైద్య చికిత్సకై సంప్ర॥ 36 సం॥ Exp. డా॥ Ch.జితేందర్ BHMS శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్. Opp: న్యూ బస్టాండ్, హన్మకొండ. 9849117394. [WA-7575]

WANTED

- **Wanted** డ్రైవర్స్: భవాని ఖార గొర్రెకుంటలో పని చేయుటకు DCM డ్రైవర్స్ కావలెను. ఫోన్ కాల్ టైమ్స్ 11AM - 6PM. Cell: 9396991649 [SCA25007683]
- మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్‌బంక్‌లో పని చేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సెల్: 8247771016, 8247771525. [WA-7580]
- **WGL** విష్ణు లాడ్జిలో మేనేజర్స్‌గా పని చేయుటకు రిటైర్డ్ ఉద్యోగులు Age 50 సం॥పైన వారు కావలెను. జీ. 8 వేలు 12 hrs. డ్యూటీ. 9391864657 [SCA25006289]
- షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ కేర్ టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 8985114453, 9391036931 [HA-16135]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198 9866574715
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	7702221602
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.